




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1,050 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

## –3–

ఆంధ్రపత్రిక గురించిన వివరాలన్నీ"ఆంధ్రపత్రిక చరిత్ర"అనే పుస్తకం నుండి తీసుకుంటున్నాను. దాని రచయిత C. V. రాజగోపాలరావు గారు.

"ఆంధ్రపత్రిక"ఒక పత్రిక కాదు, ఒక వ్యవస్థ, 8 దశాబ్దాల పైగా తెలుగువారి జీవన సంస్కృతితో, అవినాభావంగా అల్లుకుపోయిన అమూల్యమైన అక్షర ప్రస్థానం. కాశీనాధుని నాగేశ్వరావు పంతులుగారు పటిష్టమైన పునాదులు వేసిన పత్రికలు మూడు. 1. ఆంధ్రపత్రిక (వారపత్రిక), 2. ఆంధ్రపత్రిక (దినపత్రిక), 3. భారతి (సాహిత్య పత్రిక). వీటిలో మొట్టమొదట ప్రారంభం అయినది ఆంధ్రపత్రిక వార పత్రిక. దాని మొట్టమొదట సంచిక 1908 సెప్టెంబర్ 9 న మార్కెట్ లోకి వచ్చింది. 41సంవత్సరాల వయసులోనే విజయవంతమైన వ్యాపారవేత్తగా తనకు తాను నిరూపించుకున్న తెలుగువాడు, 112సంవత్సరాల క్రిందట బొంబాయిలో ప్రారంభించిన మొట్ట మొదటి పత్రిక "ఆంధ్రపత్రిక" వారపత్రిక.


ఆ సమయానికి ఆంధ్రదేశంలో ప్రజాదరణతో కొనసాగుతున్న ఇతర పత్రికలు కూడా వున్నాయి. ఉదాహరణకు కృష్ణాపత్రిక, ఆంధ్రప్రకాశిక, శశిలేఖ లాంటివి. వీటిలో కృష్ణాపత్రిక గురించి క్రిందటి భాగం మాట్లాడుకున్నాం. 1886 లోనే మొదలై, వార్తలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చిన తొలి పత్రిక "ఆంధ్ర ప్రకాశిక" అని చరిత్ర కారులు అంటారు. దీన్ని A.P. పార్ధ సారధి అనే ఆయన మద్రాస్ నుండి నడిపేవారు. అలాగే "శశిలేఖ" కూడా. 1900 ప్రాంతాల్లోనే మద్రాస్ నుండి వచ్చింది.




ఈ పత్రికలన్నీ ఉండగా వాటి మధ్య నుండి దూసుకు వచ్చింది "ఆంధ్రపత్రిక". తెలుగు నేలకు వందల మైళ్ళ దూరంలో బొంబాయి నుండి పత్రిక ప్రారంభంచడం అనేది, చాలా సాహసం కూడుకున్న పని. అప్పటికే అమృతాంజనం వ్యాపారం లాభాలలో వుంది. నాగేశ్వరావు పంతులుగారికి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గానీ, వాటిని ఎదుర్కొనే సంకల్ప బలం, ఆత్మ విశ్వాసం మెండుగా వున్నాయి. మొదట్లో ఆంధ్రపత్రిక ఆఫీసు ఫోర్ట్ (fort )ప్రాంతాల్లో "ఫ్రెరే స్ట్రీట్ "అనే చోట ఉండేది. 109 నంబర్ గల ఇల్లు. పత్రికాఫీసు అంటే రెండే గదులు. ప్రింటింగ్ మాత్రం తత్వ వివేచికా ముద్రణ శాల అనే వేరే ప్రెస్ లో జరుగుతుండేది.

మరి బొంబాయిలో తెలుగు కంపోజిటర్లూ, ఎడిటోరియల్ స్టాఫ్ ఎక్కడ దొరుకుతారు. వాళ్ళందరినీ కూడానాగేశ్వరావు పంతులు గారు ఎక్కువ జీతాలు ఇచ్చి, బొంబాయి తీసుకువెళ్లారు. ఇది వారపత్రిక కదా! ప్రతి బుధవారం విడుదల అయ్యేది. అయితే, అది బొంబాయి నుండి ఆంధ్ర దేశంలోని అన్ని ప్రాంతాలకూ వెళ్ళాలి. అదంత తేలికైన పని కాదు. పెద్ద నగరాల నుండి పల్లెటూర్లకి వారానికి రెండు రోజులే టపా వెళ్ళేది. అంటే బుధవారం బొంబాయిలో కొత్త సంచిక బయలుదేరితే, ఆంధ్ర ప్రాంతాల్లో పెద్ద పోస్ట్ ఆఫీసుల నుండి పల్లెటూర్లకి వెళ్ళేది. బుధవారం ప్రింటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ఆఫీసుకు వెళ్లిన వెంటనే, పంతులు గారు, స్టాఫ్ అందరికీ పార్టీ ఇచ్చేవారు. ఆరోజుల్లో పాఠకులు అంటే, ఎక్కువమంది చందాలు కట్టినవారే. చందా దారుల సంఖ్య 2 వేలతో మొదలై 7 వేల వరకూ వెళ్ళింది.

ఇంత మందికి ఆంధ్రపత్రిక వస్తోందని ఎలా తెలిసింది? తలనొప్పి రాని ఆంధ్రుడు ఉండేవాడు కాదు. అమృతాంజనం వాడని తెలుగు వాడు ఉండేవాడు కాదు. ఆరోజుల్లో అమృతాంజనం ప్రకటన మరోమ్రోగి పోతూ వుండేది. ఆలా అమృతాంజనం వాడే వారు అందరూ కూడా ఆంధ్రపత్రిక చందాదారులు అయ్యారని చెప్పుకోవచ్చు. ఇంత మంది చందాదారులు అవ్వడానికి రెండు కారణాలు వున్నాయి 1. ఆ వారపత్రిక సంవత్సర చందా కేవలం రెండు రూపాయల రెండు అణాలు మాత్రమే. చాలా మందికి అందుబాటులో ఉండేది. 2. అది కేవలం వార్తాపత్రిక అయివుంటే, అంత ప్రచారం రాకపోవును. కానీ,అందులో సాంఘిక, ఆర్ధిక విషయాలూ, కధలూ, కవిత్వమూ, వినోదమూ, రాజకీయాలూ, భాషా విషయాలూ ఇలా అన్ని వర్గాల వారికీ నచ్చే విధంగా ఉండేది.




అందుకే అంతమంది చందాదారులయ్యారు. మొదట్లో 8 పేజీలు వున్న వారపత్రిక, కొద్ది రోజుల్లోనే 20 పేజీలకు పెరిగింది. ఆ రోజుల్లో గ్రామస్థులకు ఆంధ్రపత్రిక వస్తోందంటే, ఒక పండగలాగా ఉండేది. వారం రోజులు చాలా జాగ్రత్తగా దాచుకొని చదువుకొనేవారట. ఎవరైనా ఆంధ్రపత్రిక చదివారు అంటే? ”ఆంధ్రపత్రిక నుండి అమృతాంజనం వరకు చదివేశాను “అనే వారట. ఎందుకంటే మొట్ట మొదట పేజీలో “ఆంధ్రపత్రిక “ అనే హెడ్డింగ్ ఉంటుంది. చట్ట చివర పేజీలో అమృతాంజనం అనే ప్రకటన ఉంటుంది. అంటే “మొదటి పేజీ నుండి చివరివరకూ చదివేసాను” అని అర్ధం

ఇంతకీ ఆంధ్రపత్రికను అంత ఆకర్షణీయంగా తీర్చి దిద్దిన ఎడిటోరియల్ స్టాఫ్ ఎవరు?అనేది చాలా రోజుల వరకూ పాఠకులకు తెలియదు. పబ్లిషర్ గా నాగేశ్వరావు పంతులుగారి పేరు మాత్రమే ఉండేది. అయితే ఆ సంపాదక వర్గంలో కొందరు – ఔటుపల్లి నారాయణరావు గారూ, కోపల్లి వెంకటనారాయణరావు గారూ, గాడిచర్ల

హరిసర్వోత్తమరావు గారూ, కోటం రాజు పున్నయ్య గారూ, మొదలైన ప్రముఖ పాత్రికేయులు ఉండేవారు. వీళ్ళలో ఒకరిద్దరు కృష్ణా పత్రిక నుండి బొంబాయి వెళ్లారు.

అయితే బొంబాయిలో ఈ పత్రిక నిర్వహణా, పంపిణీ అన్ని కలుపుకుంటే ఇదేమీ వ్యాపారాత్మకంగా లాభాలు తెచ్చి పెట్టె ప్రాజెక్ట్ ఏమీ కాదు. పంతులు గారికి అమృతాంజనం వలన విపరీతంగా లాభాలు వస్తుండేవి కాబట్టి, ఈ నష్టాలు లెక్కచేయకుండా, ఆ పత్రికను ఒక వ్రతం లాగా ముందుకు తీసుకువెళ్లారు. వారపత్రిక ప్రచురణలో మైలు రాయి ఏమిటంటే, ఆ పత్రిక మొదలు పెట్టిన సంవత్సరానికే అంటే 1910 లో "సంవత్సరాది సంచిక' అనే ప్రత్యేక సంచికను మొదలుపెట్టారు.

అప్పటి నుండి ప్రతిసంవత్సరం "యాన్యువల్ ఇస్యూ"అని వస్తుండేది. మొట్ట మొదటి సంవత్సరం సంచిక 248 పేజీలతో వచ్చింది. అందులో 126 ఫోటోలు వున్నాయి. ఆ రోజుల్లో ఫోటో ప్రింటింగ్ అనేది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. బ్లాక్ మేకింగ్ చెయ్యాలి. ఆ బ్లాక్ ని ప్రెస్ నుండి 'గేలీ'లో పెట్టాలి. ఇంత తతంగం ఉండేది. అందుకనే యీ 248 పేజీల ప్రత్యేక సంచికనూ రెండున్నర నెలల పాటు శ్రమించి, ప్రింట్ చేసేవారు. అది బొంబాయి లో కుదరక మద్రాస్ లోనే ప్రింట్ చేయించి, అప్పుడు మార్కెట్ లోకి విడుదల చేసేవారు. ఒక పత్రిక అనుబంధాన్ని ఇన్ని వందల పేజీలతో విడుదల చేయడం అనేది అదే మొట్టమొదటిసారి. దేనికీ వెనుకంజ వేయకుండా, అంత బలమైన పునాది వేశారు. అందుకే 83 సంవత్సరాలు నిరాఘాటంగా కొనసాగింది.

1914 లో తన పత్రిక కార్యాలయాన్ని బొంబాయి నుండి మద్రాసుకు మార్చారు. అప్పటినుండి వారపత్రికకు తోడుగా దినపత్రికను కూడా ప్రారంభించారు. ఆ తర్వాత మరో 10 ఏళ్లకు "భారతి" సాహిత్య మాస పత్రికను ప్రారంభించారు. వారపత్రిక గురించి మరికొన్ని వివరాలు...

ఈ మూడు పత్రికలూ ఉన్నప్పటికీ దేని ప్రత్యేకత దానిదే అన్నట్లుగా కొనసాగించడం, తీర్చిదిద్దడం నాగేశ్వరావు పంతులుగారి యాజమాన్య దక్షతకు గొప్ప నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఆయన ఒక వైపు అమృతాంజనం పనులూ, మరొకవైపు సామజిక సేవా కార్యక్రమములూ, ఇంకా అవసరం అని చెయ్యి జాచిన వాళ్లకు దానధర్మాలూ, వీటన్నిటి మధ్యా పత్రికలు నిర్వహించడం...! ఇంత కంటే స్పూర్తి ఏం కావాలండీ?

పంతులు గారు 1938 లో కన్ను మూశాక, ఆయన అల్లుడు "శివలెంక శంభు ప్రసాద్ గారు " 1972 వరకు అంటే, మరో 34 ఏళ్ళ పాటు నడిపారు. ఆ తరువాత అతని అల్లుడు శివలెంక రాధాకృష్ణ గారు కొనసాగించారు. 1991 లో ఆంధ్ర పత్రికను మూసెయ్యడానికి ముందు వీరాజీగారు వార పత్రికకు కొన్నాళ్ళు సంపాదకుడిగా వున్నారు. ఆయన సారధ్యంలో "కలువ బాల "అనే మహిళల మాస పత్రిక కూడా వచ్చింది.

ఆంధ్రపత్రిక  వార పత్రిక లోని కొన్ని మైలు రాళ్లు లాంటి సంఘటనలు గుర్తు చేసుకొని ఈ అంశాన్ని ముగిద్దాం. కొన్ని దశాబ్దాల తర్వాత “ఆంధ్రపత్రిక వార పత్రిక “ అనే పేరును “ఆంధ్ర  సచిత్ర వారపత్రిక”అని మార్చారు. 1950 లో నండూరి రామ్మోహన్ రావుగారు వారపత్రిక సంపాదకులై 10 ఏళ్ళ పాటు పని చేశారు. ఆ రోజుల్లోనే కొడవగంటి కుటుంబరావు గారు 1950 ఆగస్టులో వార పత్రికకు ఇన్ చార్జ్ అయ్యారు. అప్పటి వరకూ వారపత్రిక ముఖ చిత్రాలు అంటే, రేఖా చిత్రాలూ, దృశ్యాలూ, పెయింటింగ్స్, రాజకీయనాయకుల ముఖచిత్రాలూ ఇలాంటివే వస్తుండేవి. కొడవటిగంటి కుటుంబరావుగారు ఇన్ ఛార్జి తీసుకున్నాక, 1950 మార్చి నుండి సినిమా తారల వర్ణ చిత్రాలు గిరిజా, వరలక్ష్మీ, కుచల కుమారీ ఇలాంటి వాళ్ళవి ముఖ చిత్రాలుగా వేయడం ప్రారంభించారు.

ఆ మార్పుతో సర్క్యులేషన్ విపరీతంగా పెరిగింది. దాంతో పాటుగా సినిమా వార్తల కోసం 10, 12 పేజీలూ, పిల్లల కోసం 10,12 పేజీలూ, రాజకీయాల కోసం 3,4 పేజీలూ  కేటాయించారు. అంత వైవిధ్య భరితంగా వుంది కాబట్టే, ఆంధ్రపత్రిక ఇంటిల్ల పాదినీ ఆకర్షించే పత్రిక అని చెప్పుకునేవారు. మామూలు నవలలతో పాటుగా, అనువాద నవలల సీరియళ్ళూ, 1956 లో ముళ్ళపూడి గారి సినిమా సమీక్షలూ ఇలాంటివన్నీ వారపత్రిక దినదిన ప్రవర్ధమానం అవ్వడానికి దోహదపడ్డాయి.

ముళ్ళపూడి వెంకటరమణ గారు “కోతి కొమ్మచ్చి”లో తన ఆంధ్రపత్రిక అనుభవాల గురించి చాలా వివరంగా వ్రాసుకున్నారు. ఆ దశాబ్దాలలోని సాహితీ వేత్తలు చాలామంది ఆంధ్ర పత్రికలో పనిచేశారు. “ఆంధ్ర సచిత్ర వార పత్రిక” తెలుగు సాహిత్యంలోనే కాదు, తెలుగు సాంస్కృతిక చరిత్రలోనే ఒక విశిష్ట అధ్యయనం అని చెప్పుకోవచ్చు.

ఇప్పుడు,  ఆంధ్రపత్రిక (దినపత్రిక)గురించి విశేషాలు తెలుసుకుందాం. ఆంధ్రపత్రిక బొంబాయిలో వున్నప్పుడు 1913 లో నాగేశ్వరావు పంతులు గారు ఒక అభిప్రాయం వ్రాశారు.


“తెలుగు నేలకు దూరంగా ఉండడం వలన వార్తలు తాజాగా అందించడం కుదరడం లేదు. రాను రాను బొంబాయి లో ముద్రణ కష్టం అవుతోంది. అందువల్ల ఆంధ్ర పత్రికను మద్రాస్ కు మారుద్దామని అనుకుంటున్నాను. “ అని.

ఆ విధంగా ముందుగా అనుకున్నట్లుగానే 1914 మొదట్లోనే ఆంధ్రపత్రిక నిర్వహణ మొత్తాన్ని మద్రాస్ కు మార్చారు. మార్చిన కొత్తలో “జార్జి టౌన్ “లో జహంగీర్ స్ట్రీట్ అనే చోట ఇంటి నంబర్ 9 లో ఆంధ్రపత్రిక ఆఫీసు ఉండేది.

అక్కడనుండి ఆంధ్ర పత్రికను కొనసాగిస్తూనే, దినపత్రికకు శ్రీకారం చుట్టారు. ఆంధ్రపత్రిక దినపత్రిక రావడానికి ముందు రోజుల్లో తెలుగు దేశంలో వున్న దినపత్రికల గురించి చెప్పుకోవాలంటే, 1900 కి ముందు ఎక్కువగా మాస పత్రికలే. పక్ష పత్రికలో, వార పత్రికలూ చాలా తక్కువగా ఉండేవి. దిన పత్రికలైతే ఇంకా తక్కువ ఉండేవి. 1900

సంవత్సరాల మొదట్లో కృష్ణా జిల్లానుండి “దేశాభిమాని”అనే ఒక దిన పత్రిక మొదలయ్యింది. కాకపోతే మొదట్లోనే ఇబ్బందుల్ని ఎదుర్కొని ఆగిపోయి, మళ్ళీ మొదలయి, మళ్ళీ ఆగిపోయి అలా కొంత కాలం కొనసాగింది. అది కూడా ఎక్కువ కాలం నడవలేదు.

1901 ఆగస్టులో రాజమండ్రి నుండి “గౌతమి”అనే దిన పత్రిక మొదలయ్యింది. అది కూడా మూన్నాళ్ళ ముచ్చటగానే అయ్యింది. అంటే, 1914 లో మద్రాస్ లో ఆంధ్రపత్రిక దినపత్రిక ప్రారంభించడానికి ముందే ఒకటీ, అరా దినపత్రికలు వచ్చినప్పటికీ, అవేవీ ఎక్కువ రోజులు బ్రతికి బట్టకట్టలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రపత్రిక దినపత్రిక 1914 ఏప్రిల్ ఒకటిన మొట్టమొదటి సంచిక మార్కెట్ లోకి వచ్చింది. అలా మద్రాస్ కు మకాం మార్చిన 5,6 నెలల్లోనే నాగేశ్వరావు పంతులు గారు “తంబు చెట్టి స్ట్రీట్ “ లో ఒక ఇల్లు అమ్మకానికి వస్తే దాన్ని కొని పత్రిక కార్యాలయాన్ని అక్కడకి మార్చారు.




గతంలో నాగేశ్వరావు పంతులు గారు మద్రాస్ లో స్టూడెంట్ గా ఉండగా అంటే, అప్పటికి 25 ఏళ్ళ క్రిందట ఆ ఇంట్లో అద్దెకి ఉండేవారు. అప్పుడే ఆయనకు వివాహం కూడా నిశ్చయం అయింది. ఇప్పుడు అంటే 1914 లో అదే ఇంటిని కొని, దాన్ని డైలీ, వీక్లీ కార్యాలయంగా మార్చారు. బొంబాయి నుండి అప్పుడే రావడం, కొత్తగా రెండు పత్రికలు, ప్రింటింగ్ ప్రెస్ నిర్వహణ వీటన్నితో పంతులు గారికి డబ్బులు కాస్త తక్కువ అయితే, పఠాభి సీతారామయ్య గారి దగ్గరా, కోపల్లి హనుమంతరావు గారి దగ్గర 9 వేళా రూపాయలు అప్పుచేసి 47 వేల రూపాయలకు ఆ బిల్డింగ్ కొన్నారు. దానికి మరమ్మతులు చేయించడానికి మరో 35 వేల రూపాయలు ఖర్చు పెట్టారు. ఆ తర్వాత తొందరలోనే ఆ అప్పు తీర్చేసారు. ఇదీ ఆంధ్రపత్రిక ఆఫీసు మద్రాస్ ప్రారంభంలో మరీనా నేపథ్యం.

మొట్ట మొదట్లో దిన పత్రిక నిర్వహణ చాలా కష్టంగా ఉండేది. ఎందుకంటే, ఇంగ్లీష్ లో వచ్చిన వార్తల్ని సరిగా తెలుగులోకి అనువాదం చెయ్యాలి. సామాన్య ప్రజలకు అర్ధం అయ్యే భాషలోకి రాసేవాళ్ళు, ఎక్కువ మంది

ఉండేవారు కాదు. ఇక వార్తల సేకరణ సవాలుగా ఉండేది. పైగా పత్రికల భాష అంటూ ఏమీ ఉండేది కాదు. గ్రాంధికం లేదా వాడుక భాష.. ఎలా రాయాలి అనేది ఎవరికి వాళ్ళే నిర్ణయించు కోవలసిన పరిస్థితి.

ఇన్ని క్లిష్ట పరిస్థితుల్ని కూడా సమర్ధవంతంగా ఎదుర్కొని, 4 ఏళ్లలోనే "అత్యంత సమర్ధవంతంగా నిర్వహింపబడుతున్న తెలుగు దినపత్రిక "అని రాష్ట్ర ప్రభుత్వపు నివేదికలకు ఎక్కింది. ఆ సమర్ధత వెనుక ఏడాదికి ఏడాదికి పెరుగుతున్న నష్టాలు ఉన్నాయని, అమృతాంజనం లాభాలు వాటిని సమతుల్యం చేస్తున్నాయని ఒక్క నాగేశ్వరావు పంతులు గారికి మాత్రమే తెలుసు. దిన పత్రిక మొదట్లో ఇప్పుడు వస్తున్న దిన పత్రికలకు సగం సైజు లో ఉండేది. 1932 నుండి ఇప్పటి సైజుకి మారింది.

చాలా సంవత్సరాల పాటు, మొదటి పేజీ అంతా ప్రకటనలే ఉండేవి. మొదట్లో దినపత్రిక సంవత్సర చందా 12 రూపాయలు. గ్రంథాలయాలకు ఉచితంగా పంపించేవారు. దిన పత్రిక నిర్వహణకు కాస్త సహాయంగా ఉంటుందని, ఆంధ్రపత్రిక ప్రెస్ లోనే, పుస్తకాలూ, శుభలేఖలూ ఇలాంటి జాబ్ వర్క్స్ కూడా చేసేవారు. 1915 సంవత్సరాది సంచికలో ఇలా ప్రకటించారు.

"ఆంధ్రపత్రిక కార్యాలయం తెలుగూ, అరవమూ, కన్నడమూ, ఇంగ్లీష్ ముచ్చటగా అచ్చు వేయుదురు. పుస్తకములూ, శుభలేఖలూ ఇతరములు అన్నియూ చక్కగా చేయబడును. బైండింగ్ బహు రమ్యము. రంగు రంగులలో ముద్రించుటకు బహు ఏర్పాట్లు చేయుదము. "అని.

అప్పట్లో వున్న ప్రముఖ రచయితలు చాలా మంది ఆంధ్రపత్రిక ప్రెస్ లో తమ పుస్తకాలు ప్రింట్ చేయించుకుండేవారు. దినపత్రిక మొదలైన 7,8 సంవత్సరముల వరకూ సంపాదకుడు పేరు ఉండేది కాదు. 1922 నుండి నాగేశ్వరావు గారి పేరే సంపాదకుడు అని వచ్చేది. దినపత్రిక మొదట్లో సంపాదకత్వ బాధ్యతలు చూసినాయన పేరు గాడిచర్లహరి సర్వోత్తమరావు ఆయన బొంబాయి లోనే ఆంధ్రపత్రిక వారపత్రిక సంగతులు కూడా చూసేవారు. ఆ తరువాత చల్లా శేషగిరిరావు గారు దిన పత్రిక బాధ్యతలు చూసేవారు.

ఈ పత్రికల నిర్వహణతో పాటుగా "ఆంధ్రపత్రిక మేడ" అనేది ఒక ధర్మశాల లాగ ఉండేదట. ఆంధ్ర దేశం లో ఏ మూల నుంచి ఏ ప్రముఖుడు ఆ మేడ మీద పై అంతస్థులో ఉండేవారు. సాహితీ సమావేశాలే కాకుండా, కాంగ్రెస్ నాయకుల సమావేశాలు కూడా అక్కడే జరుగుతుండేవి. నాగేశ్వరావు పంతులు గారు మరణించేసరికి ఆంధ్రపత్రిక కాంప్లమెంటరీ కాపీలు 8 వేలు పంపించేవారు. అవి కాకుండా లైబ్రరీలకు ఉచితముగా ఇస్తుండేవారు. ఇవి ఆంధ్రపత్రికకు సంబంధించిన విశేషాలు.

ఇంక దినపత్రిక లోని వార్తలోని విషయానికి వస్తే, ఆ రోజుల్లో ముఖ్యమైన సంఘటనలూ, వాటి గురించి ఆంధ్రపత్రిక లో కవరేజ్ ఎలా ఉండేదో తెలుసుకుందాం.

దిన పత్రిక మొదలైన కొత్తలో మొదటి పేజీ అంతా ప్రకటనలే ఉండేవి. 1914 జూన్ 4 వ తేదీన ఆంధ్రపత్రిక దినపత్రికలో ఎడమవైపున "ఇండియన్ కేంప్ కేట్ "అని ఒక ప్రకటన ఉంటే, కుడివైపున దినపత్రిక అని, "మదాంధ్ర మహాభరతం"అనే పుస్తకం ప్రకటన వుంది. అమృతాంజనం ప్రకటన కూడా మొదటి పేజీలోనే వుంది. అలాగే లోపల వున్న వార్తల్ని క్లుప్తంగా మొదటిపేజీలో విషయం సూచిక లాగ వేస్తుండేవారు.

1914 జూన్ 4 వ తేదీ సంచికలోనే ఒక చక్కటి కార్టూన్ వేశారు. దాంట్లో తెలుగు వాళ్ళందరూ తలపాగా, టోపీ పెట్టుకొని వున్నట్లుగా వేసి, ఒక్కో వ్యక్తి కింద ఇలా రాశారు. హై కోర్ట్ వకీలుగా పనికి రారు. మరో బొమ్మ కింద మీరు నాయకులు కాలేరు. ఇంకో బొమ్మ కింద "మీరు కాంగ్రెస్ సెక్రెటరీగా ఉండజాలరు. మీదంతా వాక్శూరత్వమే. యూనివర్సిటీ రీడర్ పనికి అనర్హులు. మీది అరణ్య రోదనము.దుఃఖించి లాభము లేదు " ఇలా ఒక్కొక్క బొమ్మ కిందా వ్రాసి, ఇంకా దానికింద ఏం వ్రాశారంటే ...

"ఆంధ్ర నాయకులూ! ఇదేమి అన్యాయము. మనం హై కోర్ట్ జడ్జీలుగా పనికిరామట. మనలో నాయకులూ లేరట. ఇది వరకు శక్తి గలరని చూపిన కాంగ్రెస్ సెక్రటరీ పదవికి ఈ సంవత్సరం అనర్హులమట. యూనివర్సిటీ రీడర్ గా ఉండడానికి తగమట. మనది అరణ్య రోదనమట. ఈ స్థితి దుస్సహనీయమట. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమమే అన్నిటికీ మందు. ఆంధ్ర దేశాభివృద్ధి, ఆంధ్రుల స్వాభిమాన గౌరవమూ, దాని మీదనే ఆధారపడి యున్నవి. మనమూ, మాన ఆదర్శానుకూల ధోరణలు ద్విగుణ పరచవలయును. ఈ మధ్య సంభవించిన విషయములు ఆంధ్రులకు అనేక విధముల విషాదకరము లైనవి. " అని. .

తరువాత ముఖ్యమైన వార్త అల్లూరి సీతారామరాజు గారు మరణించిన సందర్భములో దినపత్రిక కవరేజ్. అల్లూరి సీతారామరాజు గారు మరణించింది, 1924 మే 7 అని చరిత్రలో లిఖించబడినది. మే 8 వ తేదీన ఆంధ్ర పత్రికలో ఏం వచ్చిందంటే,

"మన్యం పితూరి. ఒక రాజును అరెస్ట్ చేసిరి. 12 గురు పితూరి దార్లు హతులైరి. రామరాజు దొరకలేదు." ఇది హెడ్డింగ్. దాని క్రింద ...

"ఈ నెల 6 వ తేదీ ఉదయమున 50 మంది పితూరీ దారులకూ , పోలీసుకూ, పోరాటం జరిగినది. ఇంటిలిజెన్స్ ఇనస్పెక్టర్ ఉపేంద్ర పట్నాయక్ గారునూ, మరి కొంత మంది మలబారు స్పెషల్ పోలీసు దళం వారునూ, పితూరీ దార్లతో తలపడిరి. పితూరీ దార్లలో 12 గురు హతులైరి. ఒక రాజునూ అరెస్ట్ చేసిరి. (బహుశా ఆయన 'అగ్గిరాజు' అయి ఉంటాడు.) 300 రైఫిల్ తుపాకీలూనూ, 8 బారులు మందుగుండునూ దొరికెను. ఒక కానిస్టేబుల్ కు గాయం తగిలెను. పితూరీ దార్లు కకావికలై పరిగెత్తిరి. చాలా మంది పోలీసులు వారిని తరిమారు. పితూరీ నాయకుడు అల్లూరి రామరాజు మాత్రం దొరకలేదు. తప్పించుకొని పోయిరి. గానీ, ఆయనకు గాయము

తగిలెనని నమ్ముచున్నారు అని ఏజెన్సీ సైనిక అధికారి, చెన్నపురి దొరతనమునకు తంతి వార్త పంపెనని నేడు ఉదక మండలము వారు ప్రకటించిరి.

ఇది 1924 మే 6 న జరిగిన సంఘటన. దాని కింద ఇంకొక మాట కూడా రాశారు. "పితూరీ నాయకుడు అల్లూరి రామరాజు గారు తప్పించుకు పోవుట గురించి నిన్న అంటే 7 వ తేదీ రాత్రి ఉదక మండలములో చెన్నపురి దొరతనం వారికి తంతి వార్తలు చేరినవి. వేరు వేరు ఇద్దరు మనుషులు రెండు వార్తలు పంపిరి.

"రాజుగారిని పట్టుకొనిరి"అని ఒక తంతి వార్తలో వున్నది.


"పోరాటంలో రాజుగారిని కాల్చిరి "అని రెండవ తంతి వార్తలో వున్నది.

ఇదంతా కూడా 1924 మే 8 వ తేదీన ఆంధ్ర పత్రికలో వచ్చింది. ఆ తరవాత రోజు అంటే మే 9 వ తేదీన ఇంకొక వార్త రాశారు. "మెయిలు పత్రిక ప్రకటన నిజము కాదు. పితూరీ నాయకుడు అల్లూరి రామరాజు గారిని 7 వ తేదీ రాత్రి సబ్ –ఇనస్పెక్టర్ ఆళ్వారు నాయుడు గారు అరెస్ట్ చేసిరి. ఆయనకు గాయములు తగిలెను. గాయములు వలన రామరాజు గారు చనిపోయిరి. "అని పితూరీ నాయకుడు వడసెను.

క్రిందన "నిన్న మద్రాస్ మెయిల్ పత్రిక ప్రకటించెను గానీ, దొరతనము వారు పంపిన పై ప్రకటనము వలన మెయిలు పత్రిక ప్రకటన నిజాము కాదని తేలుచున్నది. " అని వ్రాశారు.

మొత్తానికి అల్లూరి సీతారామ రాజు మరణించిన విషయములో, ఆయన మరణించిన రెండు రోజుల వరకూ కూడా ఈ గందరగోళం కొనసాగింది. ఆ తర్వాత రోజుల్లో అన్నీ విశ్లేషించగా తెలిసింది ఏమిటంటే "అల్లూరి సీతారామరాజు గారు 1924 , ఏడవ తేదీనే మరణించారు"అని.

ఆ తరువాత భారతదేశపు మైలురాయిని చూస్తే, 1947 ఆగస్టు 15 వ తేదీన స్వాతంత్రం వచ్చింది కదా! అంతకు 2,3 రోజుల ముందు ఆంధ్ర పత్రికలో ఎలాంటి వార్తలు వచ్చాయో చూద్దాం. 1947 ఆగస్టు 12న ఆంధ్రపత్రిక దినపత్రికలో ప్రధానమైనటువంటి



మన్యం పితూరీ

ఒక రాజును అరెస్టు చేసిరి

12 గురు పితూరీదారులు హతులైరి

రామరాజు దొరకలేదు

ఈ నెల 6 వ తేదీ ఉదయమున 50 మంది మన్యంపితూరీదారులకును పోలీసువారికిని పోరాటము జరిగినది. ఇంటిలిజెన్సు యిన్స్పెక్టరు ఉపేంద్ర పట్నాయకు గారును మరి 12 మంది మలబారు స్పెషలు పోలీసు దళము వారును పితూరీదారులను తలపడిరి. పితూరీదారులలో 12 గురు హతులైరి. ఒక రాజును (బహుశా అగ్గిరాజుగారయ్యుండరు) అరెస్టుచేసిరి. ఒక 300 రైఫలు తుపాకీయును ఎనిమిది బారల మందుగుండును, దొరికెను. ఒక కనిస్టేబులుకు గాయములు తగిలెను. పితూరీదారులు వికావికలై పరుగెత్తిరి. చాలమందిపోలీసువారు వారిని తరుముచున్నారు. పితూరీనాయకుడు అల్లూరి రామరాజుగారు మాత్రము దొరకలేదు. తప్పించుకొనిపోయిరిగాని ఆయనకుగూడా గాయములు తగిలెనని నమ్ముచున్నారు. అని ఏజెన్సీ సైనికాధికారి చెన్నపురి దొరతనమునకు తంతివార్త పంపెనని నేడు (8 వ తేది) ఉదకమండలమునుండి ప్రభుత్వమువారు ప్రకటించిరి. (ఆం|ప్రె)

అల్లూరి శ్రీ రామరాజు గారు

పితూరీ నాయకుడు అల్లూరి శ్రీ రామరాజు గారు తప్పించుకొని పోవుటను గూర్చి నిన్న (7 వ తేది) రాత్రి ఉదకమండలములో చెన్నపురి దొరతనము వారికి తంతివార్తలు చేరినవి. వేరు వేరు మనుష్యులిద్దరు తంతివార్తలు పంపిరి. "రాజుగారిని పట్టుకొనిరి" అని ఒక తంతివార్తలో నున్నది.

"పోరాటములో రాజుగారిని తుపాకీతో (పాటు) కాల్చిరి" అని రెండవ తంతివార్తలో నున్నది. (ఆ. ప్రె.)

వైకం సత్యాగ్రహం

నిరంతరాయముగా సాగుచున్నది

అసిస్టెంటు రెసిడెంటు (తిరువాన్కూరు సంస్థానం) కొట్టమహాలుమమగారు త్రివేంద్రమునుండి ఎర్నాకులము వెళ్లుచు నిన్న 7 వ తేదీని వైకంకువచ్చి పోలీసు కమీషనరు పిటుగారితోగూడ నాలుగువీథులలోను కావలిభటులను వలంటీరులను చూచిరి.

అకాలీ సత్రము

అనుదినము చాలమంది అకాలీధర్మసత్రములో భోజనము పెట్టుచున్నారు. యోగం, నాయరు సభలకువచ్చినవారిలో చాలమంది అకాలీ సత్రములోనే భోజనము చేయుచున్నారు.

300 రూపాయల విరాళము

నాగర్కోయిలులో వసూలుచేసిన 300 రూపాయలను కాంగ్రెసుసంఘ కార్యదర్శి టి. శివతాను పిళ్లగారలుమండి వైకంకు తీసికొనివచ్చి సత్యాగ్రహసంఘమువారి కొసంగిరి.

పాటకచేరివలన 50 రూపాయిలు వచ్చినవి

సత్యాగ్రహసంఘనిధికొరకు నిన్న రాత్రి వైకంలో పాటకచేరీ జరుపగా 50 రూపాయలు వసూలైనవి.

శ్రీ జ్ఞానందస్వామి

నిన్న రాత్రికి శ్రీజ్ఞానందస్వామి వైకంచేరిరి. యోగం నాయరు సంయోగసభ నేడు జరుగును. ఆసభకు స్వామివెళ్లెదరు.

యోగంసభ

ఈసభనిన్న మరలజరిగినది. సుప్రసిద్ధ కేరళ కవిశేఖరుడును సంఘసంస్కర్తయునగు కుమారను ఆసంగారి మరణము వలన సంతాపమును తెలుపుచు వారి స్మారక చిహ్నమును నెలకొలుపుట కొకసంఘము నేర్పరచిరి. విదేశవస్త్రములను బహిష్కరించి ఖద్దరును ధరింపవలెను. తియ్యలందరును సత్యాగ్రహమునకు తోడ్పడి ధనమును జనము నొసంగవలెను అను తీర్మానములు గూడ నామోదింపబడెను.

నాయరు సభ

నాయరుసభ నేడు మరల జరిగినది. నిమ్నజాతులవారు వీథులవెంట నడుచుటకును దేవాలయములలోనికి వెళ్లి దేవుని పూజించుటకును వారికి హక్కులనను తీర్మానమేకగ్రీవముగా నామోదింపబడెను. నేడు జరుగు సంయోగసభకు 100 మందిని ప్రతినిధులనుగా నెన్నుకొనిరి. పీరు తియ్యపోదరులతో కలసి ఆలోచించెదరు. (ఆ. ప్రె)

*** *** ***

ప్రస్తుతము హిందూదేశము దృష్టియంతయు వైకమునకు

శీర్షిక "మహాత్ముడు ప్రాయోపవేశము చేయవచ్చని ఆశ్రమ వాసుల భావన" ప్రార్ధన, ఉపన్యాస సూచన, మతోన్మాత్తుల రాక్షస చర్యలు చూస్తూ ఊరుకోవడం కంటే, ప్రాణ త్యాగమే మేలని గాంధీజీ "

అంటే, అప్పటికి 3 రోజుల ముందు సంభవించిన మత కల్లోలాలకు చాలా కలత చెంది మహాత్మా గాంధీ ప్రాణత్యాగం చేద్దామని అనుకున్నారట.

ఆగస్టు 14న అంటే భారతదేశానికి స్వాతంత్రం రావడానికి ఒక రోజు ముందు ఆంధ్ర పత్రికలో వచ్చిన ఒక వార్త. "కలకత్తాలో శాంతి స్థాపనకై గాంధీ, సురవర్దీయుల సంయుక్త కృషి. ప్రజా హృదయాలు పరివర్తనం పొందాలని ప్రార్ధన సభలో గాంధీ హితవు. ".

రెండో వార్త. "ఐక్య రాజ్య సమితి సభ్యత్వం, ఇండియా డొమెనియన్ ప్రభుత్వానిదే"

మరొక వార్త "నిజాం కాంగ్రెస్ అధ్యక్షుడు రామానంద తీర్ధ విడుదల"

స్వాతంత్రం వచ్చిన రోజు ఏముందంటే.. పెద్ద హెడ్డింగ్..

ఒక వైపు రెండు జాతీయ జెండాలు "భారతదేశ స్వాతంత్ర సిద్ది" రెండో వైపు రెండు జాతీయ జెండాలు. దాని కింద "ఆసియా ఖండానికే కాక, సకల ప్రపంచానికి మహోత్కృష్ట సమయం. ప్రాగ్దిశాన విన్నూతన తార ఉదయిస్తున్నదని నెహ్రూ ప్రబోధ. మన స్వాతంత్ర సౌధం నిర్మించిన మహా శిల్పి గాంధీజీకి జోహార్లు."

"ఎంత భయంకరమైన ఝంఝూ మారుతం వీచిన మన స్వాతంత్ర జ్యోతిని ఆరనీయదు. అని హెచ్చరిక ఆరోజు ఆంధ్రపత్రిక దిన పత్రిక మొత్తం 68 పేజీలతో బ్రహ్మాండమైన ప్రత్యేక సంచికగా వేశారు.

ఆ తరువాత 1948 జనవరి 30 న మహాత్మా గాంధీ తుపాకీ గుండుకు గురయ్యారు కదా! అంతకు కొన్ని రోజుల ముందు ఏం జరిగిందో చూద్దాం. 1948 జనవరి 22 న ఆంధ్రపత్రికలో ఇలా వుంది "ప్రార్ధన సభలో గాంధీజీకి సమీపంగా బాంబు పేలుడు. కొద్దిలో మహాత్మునికి ప్రాణాపాయం తప్పింది. పశ్చిమ పంజాబ్ లో కాందిశీకులు ఈ అకృత్యం చేసినట్టు సూచన"

దాని తర్వాత జనవరి 30న తుపాకీ గుండుకు గురి కావడం జరిగింది. 31 వ తేదీన వార్తా చాలా కొద్దిగా వచ్చింది. "మహాత్ముని హత్య. ప్రార్ధన సభకు పోతుండగా రివాల్వర్ తో కాల్పులు." ఎందుకంటే 30 వ తేదీ సాయంత్రం 5 గంటలకు జరిగింది కాబట్టి, 31 వ తేదీ పేపర్లో పెద్దగా కవరేజ్ ఇవ్వ లేకపోయారు. అదే 1948 ఫిబ్రవరి 1 న వచ్చిన పత్రికలో మహాత్మా గాంధీ యొక్క మరణం గురించి చాలా విశేషాలు రాసారు. మొట్టమొదటి పేజీలోనే

"ప్రపంచ శాంతికీ, విశ్వ కల్యాణానికీ, అహర్నిశలు ఏకాగ్రతతో కృషి చేసిన గాంధీకి విషాద మరణం. ప్రార్ధన సభకు వెళుతుండగా యువకుని దుస్సాహస ఫలితం. భారత జాతి గాంధీజీని కోల్పోయింది. న్యూ ఢిల్లీ జనవరి 30.

"బాపూజీ ఇక మనకు లేరు. సమస్త మానవ కోటినీ అఖిల ప్రపంచాన్ని దుఃఖం లో ముంచిన ఈ విషాద వార్త నేటి సాయంత్రం 5 గంటల 40 నిముషాలకు బిర్లా భవనం వద్ద దుఃఖం తో కూడిన ప్రజా సమూహానికి గాంధీజీ ఆశ్రమవాసి చెప్పారు"

"అరగంటకు పూర్వం దారుణమైన రివాల్వర్ కాల్పులకు గురి అయి, ప్రార్ధనా సభలోనే కూలిపోయిన మహాత్ముని స్థితిని తెలుసుకోవడానికి ఆత్రంగా వున్న ప్రజలు ఈ వార్త విని ఖిన్నులైరి. "

ఇది మొట్ట మొదటి పేజీలో వచ్చింది.

1948 ఫిబ్రవరి 1న మహాత్మునికి ఏం జరిగింది? అనే వార్త యొక్క వివరాలు ఇలా రాసారు.

రివాల్వర్ కాల్పులు

న్యూఢిల్లీ :జనవరి 30: మనుమరాళ్ళు ఇరువైపులా వెంటరాగా, వారి భుజములపై చేతులు ఉంచి, సరిగ్గా ఈ సాయంత్రం 5గంటల 5 నిముషములకు మహాత్ముడు సాయం ప్రార్ధన సభకు ప్రయాణమైరి. మహాత్ముడు వేదికను సమీపించు చుండగా సభకు వచ్చిన ప్రజలు దారి చేయుటకు అటూ,ఇటూ తప్పుకొనిరి. ఆ సమయంలో ఖాకీ చొక్కా, లాగూ తొడుక్కొని వున్న 30,35 ఏళ్ళ వయస్కుడు సమూహం నుండి 4 సార్లు రివాల్వర్ కాల్చెను. హంతకుడు, గాంధీకి రెండు బార్ల దూరంలోనే వున్నాడు. మొదటి గుండు గాంధీజీ కడుపులోనే తగిలింది. వెంటనే గాంధీజీ వాలిపోయారు. మరో గుండు సరిగ్గా మహాత్ముని హృదయంలో తగిలింది. మహాత్ముని తీసుకువస్తున్న మనుమరాళ్ళు అభాగా గాంధీ, మనూ గాంధీ అలాగే గాంధీజీని నిలుపుతూ బావురుమన్నారు.

అంతా క్షణంలో జరిగిపోయింది. ప్రజలకు ఏం జరిగిందో కూడా తెలియలేదు. చుట్టూ వున్నా ప్రజలు అమాంతం హంతకుడిపై పడి పట్టుకున్నారు. కొందరు మాత్రం భయ భ్రాంతులై బెదిరిపోయిరి. మరికొందరు మహాత్ముని సాన్నిధ్యానికి పరిగెత్తారు. అప్పటికే రక్తం వరదలై ప్రవహిస్తోంది. గాంధీజీని వెంటనే బిర్లా భవనానికి తీసుకుపోయినారు. వైద్యులను తక్షణం పిలవనంపించినారు. గాంధీజీని ఉంచిన గదికి ఎవరినీ పోనివ్వలేదు. సరిగ్గా 5.45 నిముషములకు గాంధీజీ ఆశ్రమవాసి మహాత్ముని మరణ వార్త బిర్లా భవనం వద్దకు చేరిన ప్రజలకు తెలియజేసారు"

ఇది ఆ వార్త యొక్క సవివరమైన కవరేజ్.

అలాగే అదే రోజు ఆంధ్రపత్రిక యొక్క సంపాదకీయంలో ఏం రాసారంటే... "జాతి జనకుని మరణం. మహాత్ముడు మరణించెను. భారత జాతి జనకుడు గతించెను. ప్రార్ధన సభకు వేళ్ళు చుండగా ఒక యువకుడు ఆయనను రివాల్వర్ తో కాల్చి, హత్య చేసెను. ఇది నమ్మశక్యం కాదు. నమ్ముటకు మనసు అంగీకరించదు. ఇంత పైశాచిక కృత్యము జరుగునా? కానీ, జరిగినది. మరణించినది గాంధీ కాదు. మరణించినది భారతదేశం.

భాదపడవలసినది, ఏడ్వవలసినది ఆయన మరణించుట వలన కాదు. ఆయన హత్య చేయబడుట, మిక్కిలి ఏడ్వవలసియున్నది. ఒక్కసారి కాదు. అనేక పర్యాయములు ఆయన తన ప్రజలకొరకు ఆత్మ త్యాగము చేయ పూనుకొనెను. కానీ, మరణ దేవత కూడా వెనుకాడినది. మతోన్మాదముచే కలుషితమైన భారత ప్రజా హృదయములను పరిశుద్ధము చేసి, సన్మార్గమున బెట్టుటకు ప్రాయోపవేశమునకు పూని, విరమించి పక్షము రోజులు కూడా గడవలేదు. ఆ ప్రాయోపవేశ దీక్ష ఫలించిందని సంతసించుండగానే బాంబు వేయుట జరిగినది."

ఇది ఆ ఎడిటోరియల్ లో కొంత భాగం మాత్రమే.

ఇలా ఆ దశాబ్దాలలో భారతదేశంలో జరిగిన ఏ ముఖ్యమైన సంఘటన తీసుకున్నాగానీ, అప్పట్లో ప్రజల స్పందన ఎలా ఉండేది? ఆ సంఘటన యొక్క ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్ అంతా కూడా ఈ ఆంధ్ర పత్రికలో లభిస్తుండేది.

తరువాత 1975 జూన్ లో భారతదేశం ఎమర్జెన్సీ ప్రవేశ పెట్టబడింది. ఆ సంఘటన జరిగినప్పుడు ఆంధ్రపత్రిక 1975 జూన్ 27 వ తేదీన ఇలా వుంది

"మంత్రి వర్గం సలహా పై రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ప్రకటన "


మళ్ళీ కుడి వైపున "చట్టబద్ధంగా ప్రవర్తించే పౌరులకు బాధ ఉండదని ప్రధాన మంత్రి ప్రకటన."

అలాగే అత్యవసర పరిస్థితిని నిరసిస్తూ ఏమీ చెప్పకుండా, ఆ రోజు రాయాల్సిన ఎడిటోరియల్ స్థానం పూర్తిగా తెల్లగా ఖాళీగా ఉంచేశారు. ఆలా 2,3 రోజుల పాటు కొనసాగిందట. ఆ విధంగా ఆరోజుల్లో వచ్చిన చాలా పత్రికలు అత్యవసర పరిస్థితి పట్ల నిరసనను తెలిపాయి.

ఆంధ్రపత్రిక చరిత్రలో ఇలా చాలా దశాబ్దాలు దిగ్విజయంగా సాగిన ఆంధ్రపత్రిక డైలీ, ఆ తరువాత విజయవాడకూ, ఆ తర్వాత హైదరాబాదుకూ కార్యాలయాన్ని మార్చారు. 1980 తర్వాత ఆంధ్రపత్రిక దినపత్రికకూ, మిగతా దినపత్రికలు గట్టిగా పోటీ ఇవ్వడం, అలాగే నిర్వహణా సమస్యలూ, చిట్టా చివరి రోజుల్లో పారిశ్రామిక వేత్తలు ఆంధ్ర పత్రికను ఆగకుండా కొనసాగించాలని ప్రయత్నాలు చేసినప్పటికీ, 1991 మొదట్లోనే, ఆంధ్రపత్రిక దినపత్రిక తో పాటుగా, మిగతా రెండు పత్రికలు కూడా మూసెయ్యాక తప్పనిసరి పరిస్థితి వచ్చింది. ఆ పత్రికలో పనిచేసిన కొంత మంది ప్రముఖుల పేర్లు ప్రస్తావించుకొని ఆంధ్రపత్రిక విశేషాలు ముగిద్దాం.

నీలంరాజు వెంకట శేషయ్య గారు, పండితారాధ్యుల నాగేశ్వరావు గారు, బసవరాజు అప్పారావు గారు, వావిలాల గోపాలకృష్ణయ్య గారు, గిడుగు సీతాపతి గారు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, శిష్ట్లా ఉమామహేశ్వరావు గారు, నండూరి రామ్మోహనరావు గారు, ముళ్ళపూడి వెంకటరమణ గారు, సూరంపూడి సీతారాం గారు, ఇనగంటి వెంకటరావు గారు, వీరాజీ గారు.... ఇలాంటి వాళ్లంతా కూడా ఒక్కోసారి ఆంధ్రపత్రిక దిన పత్రిక లోనూ,

ఒక్కోసారి వార పత్రికలోనూ కూడా పని చేశారు. ఆ రోజుల్లో భారతదేశంలో నడుస్తున్న ఇండియన్ ఎయిర్ లైన్స్ ఫ్లయిట్ లో అధికారికంగా ఆంధ్రపత్రిక దిన పత్రికను ఇస్తుండేవారు. "ఆంధ్రపత్రిక ఆ సమయంలో తెలుగు దినపత్రికల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా ముగిసింది." అని చెప్పుకోవడానికి ఏమాత్రం సందేహించవలసిన అవసరం లేదు.




సాహిత్య మాసపత్రిక "భారతి". ఆ పత్రిక విశేషాలు క్లుప్తంగా తెలుసుకోవాలంటే, కాశీనాధుని నాగేశ్వరావు పంతులు గారికి అసలు ఈ పత్రికను ప్రారంభించాలన్న ఆలోచన ఎలా వచ్చిందో చూద్దాం. ఎందుకంటే, అప్పటికే వారపత్రిక వస్తోంది. దాంట్లో సాహిత్య విశేషాలు వస్తున్నాయి. అలాగే దినపత్రికలో కూడా శనివారం గానీ, ఆదివారం గానీ "సారస్వాతానుబంధం" అని ప్రత్యేకంగా వార్తలు వేసేవారు. మరలాంటప్పుడు ఆ రెండూ వుంటూవుండగా మళ్ళీ ఒక సాహిత్య మాస పత్రికను ప్రారంభించాలి అన్న ఆలోచన పంతులుగారికి ఎందుకు వచ్చింది అంటే...

ఆ రోజుల్లో 1920 ప్రాంతాల్లో బందరు నుండి "శారద"అనే పత్రిక వచ్చేది. ఆ పత్రిక అప్పట్లో వచ్చే "సాహిత్య పత్రికలన్నిటిలో ఉన్నతమైనది" అని పాఠకుల్లో పేరు తెచ్చుకుంది. ఆ "శారద" పత్రిక విజయం చూసాక, పంతులు గారికి అనిపించింది. 'మనం కూడా సాహిత్యం కోసం ఒక పత్రిక తీసుకురావాలి" అని. వేటూరి ప్రభాకర శాస్త్రి గారి తో ఆయన చర్చించారు. వనపాకం అనంతాచార్యులు గారు, రామేశం గారు, టంగుటూరు ప్రకాశం పంతులు గారు, ఇలాంటి వాళ్ళందరితో నాగేశ్వరావు పంతులు గారు తన ఆలోచనని పంచుకున్నారు. వాళ్ళందరూ సమర్ధించారు. "ఇప్పటికే మీకు ప్రెస్ వుంది. రెండు పత్రికలు వున్నాయి. నిర్వహణకు సంబంధించిన యంత్రాంగం అంతా వుంది కదా! మీదైనా శైలి లో విశిష్టమైన సాహిత్య పత్రికను తీసుకువస్తే బాగుంటుంది "అన్నారు.

అప్పుడు వాళ్లనే అడిగారాయన "ఎవరైనా సమర్ధుడైన సంపాదకుడ్ని ఎవరినైనా చూడండి "అని. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఒకాయన పేరు చెప్పారు. ఆయన పేరు "గన్నవరపు సుబ్బరామయ్య"గారు. ఆయన అప్పట్లో మద్రాస్ ప్రభుత్వ పుస్తక భాండాగారంలో పని చేస్తున్నారు. ఆయనది చాలా విచిత్రమైన నేపథ్యం.


ఆయన ఫస్ట్ ఫారం వరకే చదువుకున్నారు. పౌరోహిత్యం నేర్చుకున్నారు. దానితో పాటుగా "స్టెనో గ్రఫీ" లో కూడా అనుభవం ఉంది. "ఏదైనా విని ఆకళింపు చేసుకోవడం, ఏపని అప్పగించినా , చాలా క్రమ శిక్షణతో, నమ్మకంతో పూర్తి చేయగల వ్యక్తి. అద్భుతమైనటువంటి ఆలోచనా శక్తి, పాండిత్యమూ వున్న వ్యక్తి"అని పంతులు గారితో చెప్పారు. ఆ విధంగా గన్నవరపు సుబ్బరామయ్య గారిని సంపాదకుడుగా పెట్టుకొని భారతి పత్రికను ప్రారంభించారు. ఆ పత్రిక మొట్టమొదటి సంచిక 1924 జనవరి ఒకటిన విడుదల అయ్యింది.

భారతి మొట్టమొదటి సంచిక నుండే తనదైనటు వంటి ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ వచ్చింది. "భారతి ఉధృతికి, మిగతా సామాన్య పత్రికలు నిలబడలేకపోయాయి." అని అప్పట్లో చాలా మంది విశ్లేషకులు భావిస్తుండేవారు. ఆ తరువాత దశాబ్దాలలో ప్రతి కవీ, ప్రతి రచయితా, పరిశోధకుడూ, కథా రచయితా, నవలాకారుడూ, చరిత్ర కారుడూ, ఎవరైనా భారతిలో వ్రాసి పేరు తెచ్చున్నవాళ్ళే. అలాగే భారతి యొక్క ఆశయం – అన్ని వర్గాల సాహిత్య వేత్తలనూ, రచయితలనూ, అన్ని సిద్ధాంత రచనలనూ ప్రోత్సహించింది. అంతేకాకుండా "తమని విమర్శించేవాళ్ళని కూడా ప్రోత్సహించాలి. కాకపోతే, విమర్శ ఈసడింపుగా ఉండరాదు.తమ కుళ్ళును భారతి ద్వారా వెళ్లబోసుకుందామని అనుకుంటే మాత్రం అవకాశం ఇవ్వకూడదు" అని వాళ్ళు ఒక ఆశయాన్ని పెట్టుకొని, ఆ ఆశయంతో 1924 నుండి 1991 వరకూ కూడా తమ ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ వచ్చారు. అన్ని దశాబ్దాలలో భారతి లో ఒక రచన వచ్చింది అంటే, అదొక ప్రామాణికం.

ప్రతి రచయితా, ప్రతి కవీ, ప్రతి పండితుడూ, తమ రచన భారతిలో రావాలని పదేపదే ఎదురు చూస్తూవుండేవాడు. భారతిలో చాలా రకాలైన శీర్షికలు వచ్చాయి. మాములు కథలూ, శీర్షికలూ వీటితో పాటుగా తెలుగు సాహిత్యానికి కాకుండా, సంస్కృత సాహిత్యానికి, చరిత్రకూ, పురాతత్వానికీ, శాసన సాహిత్యానికీ, విజ్ఞాన శాస్త్రానికీ, సంఘ పురోగతికీ, మహిళా అభ్యుదయానికీ, సాహిత్య, సాంఘిక సేవ అన్నట్లుగా నడిచింది భారతి పత్రిక. మొట్టమొదటి సంపాదకుడైన గన్నవారపు సుబ్బరామయ్య గారి మీద పంతులుగారికి ఎంతనమ్మకం ఉండేదంటే, ఒకసారి , నాగేశ్వరావు పంతులు గారు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలుకి వెళ్లాల్సి వచ్చింది. అప్పుడు ఆయన ఎడిటోరియల్ డిక్లరేషన్ సుబ్బరామయ్య గారి మీదకు మార్చారు. మళ్ళీ ఆయన జైలు నుండి విడుదలై వచ్చాక కూడా తన మీదకి మార్చుకోలేదు.

పంతులు గారు మరణించిన 1938 వరకూ డిక్లరేషన్ సుబ్బరామయ్య గారి పేరు మీదనే వుంది. వాళ్ళిద్దరికీ పరస్పరం నమ్మకం అంతలా ఉండేది. సుబ్బరామయ్య గారు కూడా ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూవ, పత్రిక ప్రతిష్టను నెలనెలా ఇనుమడింప జేసుకుంటూ కొనసాగించారు. ఇప్పటికి కూడా ఆ రోజుల్లో వచ్చిన ఉత్తమ సాహిత్యం, ప్రామాణిక సాహిత్యం కావాలంటే, అప్పటి భారతి పత్రికలను తిరగెయ్యల్సిందే. చాలా మంది పరిశోధకులు ఏదైనా ప్రామాణిక విషయం కావాలంటే, తెలుగు సాహిత్యంలో పాత భారతి పత్రికలనే ఆధారం చేసుకొంటారు. ఈ భారతి మాస పత్రిక కూడా 1991 లో మిగతా రెండు పత్రికలతో పాటుగా ఆగిపోయింది.

ఇవండీ 20 వ శతాబ్దపు రాజకీయ, సాంఘిక రంగాలపై తనదైన ముద్ర వేసి 8 దశాబ్దాల పాటు కొనసాగిన ఆంధ్ర పత్రికలోని కొన్ని మజిలీలూ, కొన్ని మైలు రాళ్ళూ, కొన్ని చలి వేంద్రాలూ. మళ్ళీ మనం 1908 ప్రాంతాలకు ఆంధ్రపత్రిక ప్రారంభం అయిన సంవత్సరానికి వెళదాం. అక్కడ నుంచి ప్రారంభించి, ఆ తరువాత మొదలైన కొన్ని పత్రికల వివరాలు తెలుసుకుందాం.



ఆంధ్రభారతి.

సచిత్ర మాసపత్రిక.

సంపుటము 3 ] అక్టోబరు 1912 సం॥ [ సంఖ్య 4

కోకిల.*

[ మంగిపూడి వేంకటశర్మకవి ]

గీతము

నవనవ్రాప వనంబను నాటకమున
దర్శితవగు కోకిలా! స్వాగతంబు నీకు.
శ్రీయెలర్పు వసంతుని రాయబారి
వైన పైకమ! నీకు శుభావహంబు.
ఆదరముతోడ నీకు సుఖాసనంబుఁ
జక్కఁ జేయుచు నున్నాఁడు చైత్రుఁడిపుడు
కౌతుకముతోడ స్వాగత గీతములను
బాడుచున్నవి శృంగార వనములెల్ల.

అందమును జిందు మాకంద బృందమెపుడు
కెంజిగురు గమితోడ రాగిల్లుచుండు?
నపుడె మేమెల్లరము నీయథార్థమైన
సుస్వర సుధారసముఁ గ్రోలి చొక్కఁగలము.

పుడమిపై నీకు దారిఁ జూపుటకుఁ గాని
తిరుగు వత్సరమందు గుర్తిడఁగఁగాని
నింగి నక్షత్రి మెదియైన నీకుఁ గలదో?
అతులితానంద రసమగ్నమైనమనసుఁ
గలిగి చెలఁగెడు నట్టి ప్రేక్షకుఁడవైన
పులుఁగ! నీపాటతోఁ బాటు పుష్పసమయ
మునకు స్వాగతమిచ్చెదము ముదముఁ బొదలఁ
బూవుఁ బొదరిండ్లలోపలఁ బులుఁగుగముల
మధురగానంబు వినుచుఁ దన్మయుఁడనగుదు.
బడికిఁ బోవుచునుండెడు బాలకుండు
విరులఁ గోయంగఁ దోఁటలోఁ దిరుగుచుండి
నవ్యమైన వసంతగానమును గ్రోలి
కరము మదిసిఁ జలించు నాకస్మికముగఁ
దనివి తీరక నీపాట ననుసరించు.

* లోగన అను ఆంగ్లేయకవి «కోకిలను» ననుసరించి వ్రాయఁబడినది.

తరవాత మనం ముచ్చటించుకోవాల్సిన పత్రిక "ఆంధ్రభారతి". ఇది 1910 లో బందరులో మొదలై , 5 సంవత్సరాల పాటు నిరాఘాటంగా కొనసాగింది. ఆ తరువాత కొంత కాలం ఆగిపోయి, 1926 లో మళ్లీ మొదలై, మరో 2 సంవత్సరాలు నడిచింది. ఆ రోజుల్లోనే మిగతా పత్రికలతో పోల్చుకుంటే, అప్పటి నూతన సారస్వతంలో అన్ని వర్గాలకూ, అన్ని వాదనలకూ చెందిన రచనలతో వచ్చిన తొలి మాస పత్రిక "ఆంధ్రభారతి".

ఆంధ్రపత్రిక వారి భారతి 1924 వరకూ రాలేదు. ఈ ఆంధ్రభారతి

మాత్రం 1910 లోనే మొదలయ్యింది. ఆ తరువాత ముట్నూరు, బెజవాడ అక్కడ నుండి కూడా కొనసాగింది. ఈ ఆంధ్ర భారతికి ప్రత్యేక సంపాదకుడు అంటూ ఎవరూ లేరు. పోషకులే ఉండేవారు. అంటే డోనర్స్ అన్నమాట. ఈ ఆంధ్ర భారతికి పోషకులు ప్రముఖ జమీందార్లు. చల్లపల్లి రాజా గారూ, కపిలేశ్వర పురం రాజా గారూ, మునగల రాజా గారూ, పిఠాపురం రాజా గారు ... అలాంటి వాళ్ళందరూ ఆంధ్ర భారతికి పోషకులుగా ఉండేవారు.

ఈ పత్రికల్లో రచనలు చేసినవారు, ఆ కాలంలో ప్రముఖులందరూ. ఉదాహరణకు జయంతి రామయ్య గారూ, గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారూ, (ఆయన బొంబాయి లో ఆంధ్రపత్రిక ఉండగా అక్కడకూడా పనిచేశారు.) కొమర్రాజు లక్ష్మణరావు గారూ, భోగరాజు పఠాభి సీతారామయ్య గారూ, చిలకమర్తి వారు, తిరుపతి వెంకట కవులు... ఆంధ్రభారతి గురించి ప్రత్యేకించి ప్రస్తావించడానికి కారణం ఏమిటంటే... గురజాడ అప్పారావు గారి రచనలను తొలిసారి ప్రచురించిన పత్రిక ఇదే కావడం.

మొట్టమొదటి ఆధునిక కథకునిగా విమర్శకులూ, పరిశోధకులూ అంగీకరించిన గురజాడ అప్పారావు గారి 'దిద్దుబాటు" ఈ ఆంధ్రభారతి లో 1910 జనవరి తొలి సంచికలోనే ప్రచురించబడింది. ఆ తరువాత చాలా ఆంధ్రభారతి సంచికల్లో గురజాడ వారి – మీపేరేమిటి?, కన్యక, తోకచుక్క , లవణరాజు కథ... ఇలాంటివన్నీ కూడా ప్రచురితమైనాయి. ఈ పత్రిక రెండు సంచికలకూ ముఖ చిత్రం అంటూ ఏమీ లేదు. 3వ సంచిక 1910 మార్చి నుంచి ముఖ చిత్రం మొదలుపెట్టారు , 1910 మార్చి వచ్చేసరికే ఆంధ్రభారతి సింగిల్ కలర్ ఫోటోలు కూడా ప్రచురించడం మొదలుపెట్టారు.

సాంకేతికంగానూ, సాహిత్య ప్రమాణాల ప్రకారంగానూ, ఉత్తమ విలువలతో కొనసాగింది ఈ ఆంధ్రభారతి పత్రిక. ఇలాంటి పత్రికలన్నీ సంస్థాగతంగానూ, వ్యాపారాత్మకంగానూ నడవలేదు కాబట్టి, మొదట్లో 5 ఏళ్ళూ, మళ్ళీ 10 ఏళ్ళ తర్వాత 2 ఏళ్ళు నడిచి మూతపడిపోయింది. వీటన్నిటితోనూ పోల్చుకుంటే, ఆంధ్రపత్రిక 80 సంవత్సరాలు పైగా నిలబడడానికి కారణం, దాన్ని ఒక వ్యవస్థగా తీర్చిదిద్దినటువంటి పంతులుగారి ముందు చూపు అని చెప్పుకోవచ్చు.

ఆ కాలక్రమంలో చెప్పుకోదగ్గ మరో పత్రిక "త్రిలింగ". ఈ పత్రిక 1914 లో మద్రాస్ లో ప్రారంభమయి 40 ఏళ్ళు నిరాఘాటంగా నడిచింది. అన్నేళ్లు కొనసాగింది అంటే, దాని వెనకాల పటిష్టమైన వ్యవస్థ వుంది ఉండాలి కదా! వుంది. దాన్ని స్థాపించింది ముద్రణా సంస్థ, ప్రచురణా సంస్థ యజమానులు కావడం దానికి కారణం అని చెప్పుకోవచ్చు. వాళ్లే వావిళ్ళ రామ స్వామి శాస్త్రులు &సన్స్. ఆ రోజుల్లో పుస్తకాలు ముద్రించిన వాళ్లలో, తెలుగు గ్రంధాలను ముద్రించి సేవ చేసిన వాళ్లలో ఆంధ్రపత్రిక ఒక వ్యవస్థ అయితే, వీళ్లది ఇంకో వ్యవస్థ అని చెప్పుకోవచ్చు.

వావిళ్ళ రామస్వామి శాస్త్రులుగారు స్వతహాగా పండితులు, వేదాలు పఠించిన వారు, తెలుగు వాళ్లకి నాణ్యమైన ముద్రణలో, ప్రాచీన సాహిత్యాన్ని అందించాలి, అనే ఉద్దేశ్యంతో 1854 ప్రాంతాల్లోనే (జ్ఞాపకం ఉంచుకోండి మనం మాట్లాడుతున్నది 1914 లో) అంటే అప్పటికి 60 ఏళ్ళ ముందే ఈ వావిళ్ళ వారు పుస్తక ముద్రణను ప్రారంభించారు. అనేక గ్రంథాలను ముద్రించారు. ఇదంతా కూడా సి. పి. బ్రౌన్ రాసిన పుస్తకాల్లో వుంది. ఎందుకు ఇంత ప్రత్యేకంగా చెప్పుకోవాలంటే... 1860 ప్రాంతాల్లో తెలుగు ప్రింటింగ్ అంత నాణ్యంగా ఉండేది కాదు. పేపర్లు చాలా పీచు కాగితాల్లా ఉండేవి. ముట్టుకుంటే ఒక ఏడాది అయ్యేసరికి పొడిపొడిగా రాలిపోయేవి. ముద్రణలో కూడా పదానికి పదానికి మధ్య ఎడం ఉండేది కాదు. అప్పట్లో ముద్రణ అంతా గేలీల తోటీ, మాన్యువల్ గా అక్షరం,అక్షరం కదా! అలా అక్షరం పెట్టేటప్పుడు సరిగ్గా పెట్టేవారు కాదు. అలాగే కొన్ని సార్లు ఆ ప్రింట్ గనక సరైన దిమ్మలు లేకపోతే, "పా... వా ... సా... నా.. ళ ... శ .. " ఇలాంటివన్నీ కలసిపోతుండేవి.


త్రిలిఙ్గ.
The Trilinga
సంపుటము. 2. ఫిబ్రవరి. 1915. సంఖ్య 2.

సబ్ మెరైన్ గనులు.




అందుకని 1860లలో చాలా మంది ప్రింట్ చేసిన పుస్తకాలు చూస్తే, వాటిలో ప్రామాణికత చాలా తక్కువగా కూడా ఉంటుంది. కొన్ని కొన్ని సార్లు అక్షరాలు తప్పులు కూడా ఉంటాయి. వాళ్ళు ఒరిజినల్ గానే అలా రాశారా? లేకపోతే అచ్చు తప్పా? అనేది తెలియదు.

ఇన్ని పరిమితులతో ఉన్న తెలుగు పుస్తకాల ప్రచురణలో నాణ్యతను తీసుకువచ్చిన మొట్ట మొదటి వ్యక్తి "వావిళ్ళ రామస్వామి శాస్త్రులు గారు". ఆయన ఏం చేశారంటే, ఆ పీచు కాగితాలకి బదులు డబ్బులు ఎక్కువైనా సరే, నాణ్యమైన తెల్ల కాగితాల్ని ఉపయోగించడం, అలాగే పద్యాలు ముద్రించినపుడు పాదానికి ఒక లైను చొప్పున నాలుగు లైనులు ఉపయోగించడం చేశారు. అంతకు ముందు అన్ని కలిపి వరసగా రాసేస్తుండేవారు. పదాలు కూడా పదానికీ, పదానికి మధ్య ఎడం ఉండేది కాదు. 1860 లలో ప్రారంభించిన ఈ ప్రామాణికత 1890 లో ఆయన మరణించే వరకూ ఒక వ్రతం లాగా చేశారు.

ఆయన 1890 లో మరణించారు. ఆయన మరణించేసరికి వాళ్ళ అబ్బాయి వెంకటేశ్వర శాస్త్రులుగారి వయసు ఆరు సంవత్సరాలు. ఆ తర్వాత ఆయన పెద్దయ్యాక కాలేజీలో చదువుకుంటూ, నాన్నగారు ప్రారంభించిన ఆ ముద్రణా వ్యవస్థను ముందుకు తీసుకువెళ్లాలని, కాలేజీ చదువు మధ్యలో ఆపేశారు.

వెంకటేశ్వర శాస్త్రులుగారు కూడా నాణ్యమైన పుస్తకాలను ముద్రిస్తూ ఆయన సంస్థను ముందుకు తీసుకువెళుతున్న రోజుల్లో 1914 లో ఈ "త్రిలింగ"అనే పత్రికను ప్రారంభించారు. త్రిలింగ లో కూడా అప్పట్లో ఉన్న చాలా మంది ముఖ్యమైన రచయితలు రాస్తూండేవారు. అది పూర్తిగా సారస్వత పత్రిక. దానికి ప్రారంభంలో "అక్కిరాజు ఉమా కాంతా శేఖరులు"అనే ఆయన సంపాదకుడిగా ఉండేవారు.

"వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అనే సంస్థ నుండి వచ్చిన పత్రిక కాబట్టి, 'త్రిలింగ' కూడా సుదీర్ఘ కాలం సాహిత్య సేవ చేసింది." అని చరిత్ర కారులు చెబుతుంటారు. ఆంధ్రపత్రిక 80 ఏళ్ళ పాటు నడిస్తే, ఈ త్రిలింగ పత్రిక 40 ఏళ్ళ పాటు నడవడానికి కారణం వావిళ్ళ వారి సంస్థే.


అనసూయ
సర్వతోముఖ వైజ్ఞానిక మాసపత్రిక
సంపాదకుడు :
వి. వి. యల్. ప్రభాకర్ బి.ఏ.,
సహాయ సంపాదకులు :
అనసూయాదేవి బి. ఏ.
సీతాదేవి బి. ఏ.,
★
ప్రకాశకుడు :
వి. వి. యల్. నరసింహరావు
ప్రథమ పుష్పము అక్టోబర్ 1947 ద్వితీయ తృతీయ దళములు
సంవత్సరపు చందా
(ప్రత్యేక సంచికలతో సహా)
-0-0
విడిసంచిక
6 అణాలు
A.R.No=9556/70.
'అనసూయాశ్రమము'
3, క్రెసెంటుపార్కు వీధి - త్యాగరాయనగరం - మద్రాసు

తరువాత వచ్చిన చెప్పుకో దగ్గ మరో మంచి పత్రిక "అనసూయ". ఈ పత్రిక కాకినాడ నుంచి 1917 జూలై లో మొదలైంది. అయితే 1901 లోనే కాకినాడ నుండి వెలువడిన "హిందూ సుందరి"పత్రిక గురించి గతంలో మాట్లాడుకున్నాం కదా! దాని తర్వాత మళ్ళీ అదే కాకినాడ నుండి మహిళల నేతృత్వం నుండి వచ్చిన మరో పత్రిక ఈ "అనసూయ". ఈ పత్రికను నిర్వహించింది " వింజమూరి వెంకట రత్నమ్మ". ఆమె భర్త ప్రకాశకుడు " వింజమూరి వెంకట నరసింహారావు ".

వింజమూరి వెంకట రత్నం గారు, దేవులపల్లి కృష్ణ శాస్త్రిగారి సోదరి. హిందూ సుందరి లాగా, అనసూయ పత్రికకు కేవలం మహిళలు మాత్రమే రాయాలనే నియమం లేదు. కానీ ఎక్కువ మంది మహిళలే ఉండేవారు. అయినా ఆనాటి ఎక్కువ మంది ప్రముఖ రచయితలు కూడా ఇందులో రాస్తూండేవారు. అనసూయ పత్రిక 1917

నుండి 7 ఏళ్ళ పాటు కొనసాగింది. ఈ పత్రిక నిర్వహించిన దంపతుల సంతానమే జానపద వాగ్గేయ కారులు "వింజమూరి అనసూయ, వింజమూరి సీత "గారలు.

అనసూయ పత్రిక 1917 లో మొదలైతే, 1919 లో జన్మించిన పెద్ద కుమార్తెకు వాళ్ళు "అనసూయ"అని పేరు పెట్టుకున్నారు. ఆ వింజమూరి అనసూయ గారు 99 సంవత్సరాలు జీవించారు. అనసూయ పత్రిక మొట్టమొదటి సంచికలోనే ఆ పేరు ఎందుకు పెట్టారో చెప్పారు. "అనసూయ అంటే ఒక పతివ్రత పేరే కాదు. అసూయ లేనిది అని అర్థం వస్తుంది. మాకు ఇతర పత్రికల మీద అసూయ లేదు. అలాగే వేరే వాళ్లకు మా పత్రిక మీద అసూయ కలగకుండా ఉండేలా మా పత్రికను తీసుకువస్తాము. "అని .

ఈ అనసూయ మొట్ట మొదటి సంచికలో ఏమేం వుంటాయో రాశారు. "ఇది స్త్రీల ఉపయోగార్థమూ ప్రచురింపబడు మాస పత్రిక. ఇది గృహిణులకే కాకుండా, బాలికలకు కూడా పఠనీయమై యుండును. ఇందు ప్రకృతి శాస్త్రమూ, గృహ నిర్వాహకమూ, ఆరోగ్య మార్గమూ, పురాణం స్త్రీల చరిత్రలూ, నారీమణులు చరిత్రలూ, స్థల పురాణములూ నీతి దాయకములగు నవలలూ, నాటకములూ, వింత పాటలూ, చేతి పనులూ, హాస్య ప్రసంగమూ ఇలా... " మొట్ట మొదటి సంచికలోనే ఆ పత్రికను ఎలా నడపాలి? అనే విషయాలు తెలియజేశారు.

ఈ పత్రిక 1917 లో మొదలైతే 1924 వచ్చిన అనసూయ పత్రికలో ఒక ఆసక్తికరమైన వార్త ఒకటి వుంది. అదేమిటంటే.. వెంకటేశ్వరా యూనివర్సిటీ ప్రారంభించడానికి ముందు 1924లో ఈ వార్త వచ్చింది.

దేవాలయములో విశ్వవిద్యాలయము

"తిరుపతి దేవాలయానికి ప్రతి సంవత్సరం 17,18 లక్షలు రాబడి వస్తున్నది. దాని ఖర్చు 7,8 లక్షలు మించి అవ్వడం లేదు. అందుకని మన రాజధాని ముఖ్యలగు పానుగల్లు రాజాగారు ఆ దేవాలయపు రాబడిలో ఏటేటా మిగిలిన 10 లక్షలతో ఒక గొప్ప విశ్వవిద్యాలయము స్థాపించవలయునని, దానియందు మతాది విద్యలు లెస్సగా నేర్పించి, సనాతన ధర్మములు నిలబెట్టవలయునని ప్రయత్నించు చున్నారట" అని రాసారు.

ఆ తరువాత మరో 30 సంవత్సరాలకి "ఆ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయము "1953 లో గానీ రూపు దాల్చలేదు. అది వేరే విషయం.

అయితే అనసూయ పత్రిక 1924 లో ఆగిపోయింది. ఆ తరువాత మళ్ళీ స్వాతంత్ర్యం వచ్చిన 1947 లో మొదలయి, కొద్ది నెలలు మాత్రమే నడిచింది. అప్పటికి అంటే 1947 వింజమూరిల సంతానం పెద్దవాళ్లయ్యారు. వాళ్ళ సంగీత భవిష్యత్తు కోసమని అందరూ కూడా మద్రాస్ వెళ్లిపోయారు. అందుకని రెండోసారి మొదలైన అనసూయ పత్రిక మద్రాస్ నుండి వచ్చింది. ఆసక్తి కరంగా సంపాదకులుగా వింజమూరి అనసూయా, వింజమూరి సీత గార్ల పేర్లు వేశారు.

ఇందులోకి కథలకు దేవులపల్లి వారి అబ్బాయి "బుజ్జాయి" బొమ్మలు వేశారు. ఈ పత్రిక కూడా ఎక్కువ నెలలు కొనసాగిన దాఖలాలు లేవు. ఇవండీ అనసూయ పత్రికకు సంబందించిన కొన్ని విశేషాలు.

ఇవీ 1900 నుండి 1914 వరకు పారంభం అయిన కొన్ని పత్రికల వివరాలు. ఈ పత్రికలన్నిటినీ చూస్తే.. ఇవన్నీ మద్రాస్, బందరూ, నెల్లురూ, విజయనగరం, కాకినాడా, రాజమండ్రీ ఇలా అన్నీ ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చినవే కదా! అయితే, తెలంగాణా ప్రాంతం నుండి 1915 వరకూ తెలుగు పత్రికలు ప్రారంభం కాకపోవడానికి కారణం ఏమిటి?

తెలంగాణా నుండి మొదలైన మొదటి తెలుగు పత్రిక ఏది? ఆ తరువాత తెలంగాణా నుండి వచ్చిన ముఖ్యమైన పత్రికలు ఏవి? అలాగే 1914– 1950 మధ్యలో వచ్చిన మరికొన్ని పత్రికలు ఏవి? ఇలాంటివన్నీ తరవాత భాగంలో తెలుసుకుందాం. .. .

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 ఆగస్టు18 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS